

గోరింటా పండింది.. మురిపాల అరచేత..

'గోరింటా పూచింది కొమ్మా లేకుండా.. మురిపాల అరచేత మొగ్గా తొడిగింది.. ఇంచక్కా పండిన ఎర్రాని చుక్క.. చిట్టి పేరంటాలికి శ్రీరామ రక్ష.. కన్నె పేరంటాలికి కలకాలం రక్ష'అనే దేవులపల్లి గీతం గోరింటాకు చిత్రంలో అలరిస్తుంది. ఈ పాటను ప్రతి తెలుగింటి ఆడపడుచు పాడుకుంటారంటే అతిశయోక్తి కాదు. ఆషాఢంలో ప్రతి ఆడపిల్ల కాళ్లు, చేతులకు అందంగా గోరింటాకు పెట్టుకుని మురిసితుంది. ఇది కేవలం అందంగా కనిపించేందుకు మాత్రమే కాదు.. దీని వల్ల కలిగే లాభాలూ ఎక్కువేనంటున్నారు పెద్దవారు.



గోరింటాకుతో పచ్చగా కనిపిస్తున్న మగువల అరచేతులు



ఆషాఢంలో మగువలు మెచ్చే గోరింటాకు

అనాదిగా వస్తున్న తెలుగింటి ఆచారం

అందం.. ఆకర్షణతో పాటు ఆరోగ్యం కూడా

SUNDAY SPECIAL

అల్లిపురం:

ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడానికి మగువలు ఉత్సాహం చూపిస్తుంటారు. పల్లెల్లో అయితే చెట్లు ఉంటాయి. కోసి తెచ్చుకుంటారు. నగరాల్లో వీధి వ్యాపారులు తెస్తుంటారు. రైతుబజార్లు, ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గంలో పూర్ణామార్కెట్, అల్లిపురం మార్కెట్, రామకృష్ణా రైతు మార్కెట్లలో గోరింటాకు విక్రయిస్తారు. ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం కావటంతో ఎంత ఖరీదైనా గోరింటాకు కొని, రుబ్బుకుని రాత్రి వేళ పెట్టుకోవడానికి మహిళలు, చిన్న పిల్లలు ఉత్సాహం చూపిస్తారు.

ఆచారంలో దాగిన సైన్స్..

మన వాతావరణం ప్రకారం ఆషాఢంలో వర్షాలు పడి అంతా చల్లగా మారుతుంది. సూక్ష్మక్రిములు పెరిగి అంటురోగాలు వ్యాపిస్తాయి. గోరింటాకు పెట్టుకోవడం వల్ల అటువంటి వాటికి అడ్డుకట్ట పడుతుంది. అలాగే గోరింటాకులో వేడిని తగ్గించే గుణం ఉంది. రోగ నిరోధక శక్తిని పెంచి రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ గోరింటాకు పెట్టుకోవాలని చెబుతారు. మన ఆచారాల వెనుక ఉన్న పరమార్థం అదే.

ఎర్రగా పండాలంటే..

గోరింటాకు ఎర్రగా పండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. అందులో నిమ్మరసం కలపాలి. అలాగే గోరింటాకు రుబ్బేటప్పుడు రవ్వంత చింతపండు వేసినా మంచి ఉపయోగం ఉంటుంది. గోరింటాకు తీసేసి శుభ్రం చేసుకున్న తర్వాత కొద్దిగా నూనె తీసుకుని చేతులకి రాయాలి. ఇలా చేస్తే గోరింటాకు మంచి కలర్‌లో వస్తుంది.

జాగ్రత్త వహించాలి..

ఇప్పుడున్న పరిస్థితుల్లో గోరింటాకు అందరికీ దొరక్కపోవచ్చు. అలాంటి వారు గోరింటాకు బదులుగా మెహందీ పెట్టుకోవచ్చు. దీని వల్ల మంచి ప్రయోజనాలే ఉంటాయి. అంతే కాకుండా దీంతో రకరకాల డిజైన్లు పెట్టుకోవచ్చు. అయితే మెహందీ పెట్టుకునేటప్పుడు అది మంచి కంపెనీది అయి ఉండాలి. తాజాది పెట్టుకోవాలి. అలా కాకుండా నాసిరకం ఉత్పత్తి అయితే అనారోగ్య సమస్యలు వస్తాయి.

పలు సమస్యలకు పరిష్కారం..

వర్షాకాలంలో తేమ, ఇన్ఫెక్షన్లు, చర్మ సమస్యలు ప్రబలుతాయి. సంప్రదాయం వెనుక ఉన్న సైన్స్ ఇక్కడే కనిపిస్తుంది. గోరింటాకు బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కలిగి ఉంటుంది, ఇది వర్షా కాలంలో వ్యాపించే ఇన్ఫెక్షన్ల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. ఇంటి పనిలో ఎక్కువ సేపు నీళ్లలో నానడం వల్ల మహిళల చేతులు ఉబ్బుతాయి. గోరింటాకు వాడకం వల్ల చర్మానికి స్వస్థత, చికాకు నివారణ, శరీరానికి శీతలీకరణ, నరాలకు శాంతి, మానసిక ప్రశాంతతను అందిస్తుంది.

గోరింటాకు అందమే వేరు..



ఆషాఢంలో లభించే గోరింటాకు చేతికి పెట్టుకుంటే ఆ అందమే అందం. మగువలకు మరింత వన్నె తెస్తుంది. గోరింటాకు అందానికే కాదు ఆరోగ్యానికి మంచిది. చల్లగా ఉంటుంది. నరాలు సేద తీరుతాయి కూడా.

– విజయ, గృహిణి

గౌరింటాకే గోరింటాకు అయింది..



ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం అనేది అనాది నుంచి వస్తున్న ఆచారం. శాస్త్ర సమ్మతం కూడా. గౌరీ ఇంట్లో పుట్టిన ఆకు కాబట్టి ఆ ఆకును గౌరింటాకు అంటారు. అదే వాడుకలో గోరింటాకుగా రూపాంతరం చెందింది. ఇది మగువలకు ఎంతో ఆరోగ్యం.

– మణి, గృహిణి

అదొక సరదా..



గోరింటాకు పెట్టుకోవాలంటే ఎంతో సరదా. నా చిన్నప్పుడు గోరింటాకు కోసుకువచ్చి, మూడిళ్ల ముంజూరులో రుబ్బి అంతా చక్కగా పెట్టుకునే వాళ్లం. నేటి తరం పిల్లలకు అది తెలియదు. షాపులో దొరికే కోన్‌లు పెట్టుకుంటారు.

– వి.లక్ష్మి, గృహిణి

గోరింటాకు పెట్టుకోవాలంటే ఆనందం..



గోరింటాకు పెట్టుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుంది. అంతే కాకుండా గోరింటాకు చాలా వ్యాధులను నయం చేస్తుంది. అందరితో సరదాగా గోరింటాకు పెట్టుకుంటే ఆ ఆనందమే వేరు.

– ఉమ, గృహిణి

క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 0608 10011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోంలో అన్నదానం



హోం పిల్లలతో రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: సంఘ సేవకుడు రవిశంకర్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పెందుర్తి లీనా చారిటబుల్ ట్రస్ట్ చిల్డ్రన్ హోం పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హోంలో ఆశ్రయం పొందుతున్న పలువురు చిన్నారులకు రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు రెడ్డి రమాదేవి, చిహిర్, మయూఖ్, బాదిరెడ్డి పైడితల్లమ్మ, కచ్చాల రమణమ్మ, రాము, బాదిరెడ్డి కృష్ణ (గోపి), వెంకట నాగలక్ష్మి, బాదిరెడ్డి జగన్నాథరావు, పద్మ, ఎస్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో బల్లిగిరి వెంకన్న

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. భక్తుల గోత్రనామాలతో సహస్ర నామాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

వైభవంగా సత్తమ్మతల్లి పండగ



అమ్మవారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లిపురం: రాచపోలమాంబ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా శనివారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్తమ్మతల్లికి పూజలు నిర్వహించారు. పుట్టింటి నుంచి అమ్మవారిని తీసుకుని తిరువీధి నిర్వహించారు. తప్పిటగుళ్లు, సాము గరిడీలతో కుమ్మరివీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు మీదుగా తిరిగి అమ్మవారి సతకం పట్టుకు తిరువీధి చేరుకుంది. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాచపోలమాంబ అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ఆదివారం మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా పాపాహోం రజతోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



అలరించిన పాపాహోం పిల్లల ప్రదర్శన

దాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ ప్రాంగణంలో నడుస్తున్న పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోమ్) 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, పాపాహోమ్ చైర్మన్ శంఖబ్రత బాగ్చీ, హోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పాపాహోమ్ కమిటీ, విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. పాపాహోమ్‌లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులై అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పాపాహోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణలచే నిరాదారణకు గురైన బాల బాలికలను చేరదీసి, వారిని బాగు చేస్తే మంచి భవిష్యత్ కలిగి చక్కగా జీవిస్తారని, తద్వారా స్థిరపడతారని తెలిపారు. 25 ఏళ్లుగా చక్కని ఆశయాలతో పాపాహోమ్ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులు, సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ అజిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ పాపాహోం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల తీరు ప్రశంసించారు. ఈ సందర్భంగా పాపా పిల్లలచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ అస్లాం ఆరీఫ్, రాజగోపాలరాజు, ఉపాధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, ఎంవీ రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు, పాపాహోమ్ బాల బాలికలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విశాఖను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చేశారు

- బాబు మాటల్లో ష్యూరిటీ లేదు.. అభివృద్ధిలో క్లారిటీ కానరాదు
- ఓట్లేసి మోసపోయిన ప్రజలకు ఏం చెబుతారు?
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి నిలదీత



మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: కరోనా కష్టకాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూనే ప్రజలకు సంక్షేమం అందించిన నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలనా రాజధానిగా అభివృద్ధి చేద్దామనుకుంటే అబద్ధాలతో అందలమెక్కిన చంద్రబాబు.. ప్రశాంత పట్టణాన్ని డ్రగ్స్ నగరంగా మార్చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మండిపడ్డారు. జీవీఎంసీ 30వ వార్డులో బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం వార్డు పరిధి తాడివీధిలో నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి పార్టీ శ్రేణులతో కలిసి ముందుగా బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతతకు నిలయంగా ఉన్న విశాఖలో హత్యలు.. లైంగికదాడులు.. డ్రగ్స్.. మద్యం.. బెల్టు షాపులు పేట్రేగిపోతున్నాయన్నారు. మీకు ఓటు వేసి మోసపోయిన ప్రజలకు ఏం చెబుతారని చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లను వాసుపల్లి సూటిగా ప్రశ్నించారు. కూటమి ఏడాదిగా చేస్తున్న అరాచక పాలన, మోసాలపై ప్రజలకు వివరించారు. నాడు జగనన్న అందించిన సంక్షేమాన్ని కూటమి నేతలు ఎలా అటకెక్కించారో వెల్లడించారు. చంద్రబాబు గారడీకి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు మధ్య తేడాను దృశ్యమాలిక ద్వారా స్థానిక ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, పార్టీ స్టేట్ ఆర్‌టీఐ సెక్రటరీ దశమంతుల చిన్ని, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, పార్టీ విశాఖ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా సెక్రటరీ ఆదివిష్ణు, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, జిల్లా ఆర్‌టీఐ అధ్యక్షుడు వద్దాది దిలీప్, ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కోన శంకర్, అకుల శ్యామ్, తాడి రవితేజ, రాము, దశమంతుల రామలక్ష్మి, వేణు, పలు వార్డుల అధ్యక్షులు సర్వేశ్వరరెడ్డి, దొడ్డి బాపూ ఆనంద్, రాజా రెడ్డి, ముత్తాబత్తుల రమేష్, మహ్మద్ షకీల్, గురజాపు రవి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు గంగళ్ల రామరాజు, సూర్యనాయుడు, చేపల నూకరాజు, కోరాడ సురేష్, గరికిన చంద్రశేఖర్, అజయ్‌రెడ్డి, సాగర్, కోన ప్రకాష్, తమ్మినేని శ్రీను, బుల్లెట్ రవి, సారిపల్లి అప్పలరాజు, బాలు, నారాయణమూర్తి, మీనా, మణి, జ్యోతి, కోన తిరుమల, సునీత, బోని కల్యాణి, దుర్గాప్రసాద్, బాబ్జి, త్రినాథరెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థను నమ్ముకున్న వారిని గౌరవించడం అభినందనీయం



ఉద్యోగులకు ఇంటి తాళాలు అందజేస్తున్న జాన్‌వెస్లీ

దాబాగార్డెన్స్: పదిహేనేళ్లుగా సంస్థను నమ్ముకుని పని చేస్తున్న ఉద్యోగులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ కొనియాడారు. ప్రముఖ లిఫ్ట్‌ల కంపెనీ ఐ టెక్నాలజీ ఎలివేటర్ సిస్టమ్ సంస్థ 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఉద్యోగులకు బహుమతిగా డబుల్ బెడ్ రూమ్ గృహాలు అందజేసింది. సంస్థ వార్షికోత్సవం శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జాన్‌వెస్లీ చేతుల మీదుగా సంస్థ ఆరంభం నుంచి పని చేస్తున్న నలగురు ఉద్యోగులకు డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయ తాళాలు అందజేశారు. ఏ సంస్థ అయినా లాభాల్లో నడవాలంటే ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులే కీలకమన్నారు. ఐకమత్యంతో పని చేస్తేనే మంచి ఫలితాలు సాధిస్తామని అందుకు ఉదాహరణే ఈ సంస్థ అని పేర్కొన్నారు. సంస్థ స్థాపించడం సులభమేనని, స్థాపించిన సంస్థను విజయతీరాలకు చేర్చిన వారే నిజమైన విజేతలన్నారు. కార్యక్రమంలో రెహ్మతుల్లా బేగం, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ షరీఫ్, మౌలానా సంసిద్ ఆదిల్, సంస్థ అధినేత ఏకే జిలాని, మహ్మద్ షరీఫ్, ఎండీ సులేమాన్, షేక్ సలీం జానీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఫాదర్లు, సిస్టర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ చర్చిలో ఆగస్టు 1 నుంచి జరిగే దేవమాత మోక్షారోపణ ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఆర్‌సీఎం విశాఖ ఆర్చిడయోసిస్, చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ మైదానంలో జరిగిన ఈ పోటీలను జనరల్ రెవరెండ్ ఫాదర్ దగ్గుంపూడి బాలశౌరి, రెవరెండ్ ఫాదర్ సరిస ప్రతాప్ ప్రారంభించారు. ముందుగా దేవమాత ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవాలను ఉద్దేశించి ముఖ్య సందేశం అందించారు. జ్ఞానాపురం సహాయ విచారణకర్తలు, రెవరెండ్ ఫాదర్లు, విమల్ రాజ్, ప్రేమ్‌కుమార్, సిస్టర్ రోస్‌మేరీ, జూబ్లీ ప్రిన్సిపాల్ ఆంథోనమ్మ, పీపీసీ అధ్యక్షుడు ముసురు రాజేష్ బాబు, ఏపీసీయూ అధ్యక్షుడు బూర శేషుబాబు, విజయ్‌కుమార్, విక్రాంత్, తేజ, రాఖీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత మందులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: శనివారం 39వ వార్డులో హైటెక్ వెల్ఫేర్ సొసైటీ, స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది హాజరై ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందిస్తే కూటమి ప్రభుత్వంలో వైద్యం కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినప్పుడు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి పరీలు చేయించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి 250 మంది హాజరు కాగా.. 60 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ బాబ్జీ, 39వ వార్డు ప్రెసిడెంట్ ముజీద్‌ఖాన్, కోటవీధి మజీద్ ప్రెసిడెంట్ ముషరత్ అలీ, పెద్ద అప్పారావు, ఆవాస్ కమిటీ ప్రెసిడెంట్ ఎండీ అహ్మద్, డాక్టర్ గౌతమి, సిబ్బంది దీపిక, గిరిజ, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మండించిన ఎండ

- విలవిల్లాడిన ప్రజలు
- ఇల్లు విడిచి బయటికి రాలేకపోయిన వైనం



నెత్తిపై కొంగు వేసుకుని వెళ్తున్న వృద్ధురాలు

అల్లిపురం: గత నాలుగు రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 6 నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ప్రధాన కూడళ్లు, రోడ్లలో జన సంచారం కనిపించడంలేదు. ఎండలకు భయపడి గొడుగు నీడలో కొందరు ప్రయాణం సాగిస్తున్నారు. మరి కొందరు టవళ్లు, చేతి రుమాళ్లు చుట్టుకుని వెళ్తున్నారు. శీతల పానియాలు, కొబ్బరి బొండాలు, మంచినీటికి డిమాండ్ పెరిగింది. శనివారం ఎండ చెమట్లు పట్టించింది. అధిక ఉష్ణోగ్రతతో జనం విలవిల్లాడారు. చావులమదుం జంక్షన్, బీఆర్‌రెడ్డి జంక్షన్, అల్లిపురం, రామకృష్ణా థియేటర్ ఏరియా వంటి పలు ప్రాంతాలు నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండ తగ్గి చల్లబడిన తర్వాతే రోడ్లపై జనం కనిపించారు.



జన సంచారం లేని కాన్వెంట్ జంక్షన్



కొనుగోలుదారులు లేక నిర్మానుష్యంగా ఉన్న అల్లిపురం కూరగాయల మార్కెట్



శీతల పానీయాల కోసం వేచి ఉన్న పాదచారులు, వాహన చోదకులు

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి శనివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.